ప్రజాశక్తి
శనివారం 5 అక్టోబర్ 2024 5 అనంతపురం

వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

'పురం' ఇఎస్ఐ ఆసుపత్రికి అనారోగ్యం

వైద్యులు లేరు....మందులూ లేవు....
మూడేళ్లుగా మూత పడిన ల్యాబ్
406 రకాల మందులు రావాల్సుంటే వచ్చింది 50 రకాలే
కార్మికులకు భారంగా మారిన వైద్యం

కార్మికులకు ఎంతో అండగా నిలవాల్సిన హిందూపురం ఇఎస్ఐ అసుపత్రి అనారోగ్యం పాలైంది. ఇక్కడ వైద్యులే కాదు...మందులు సైతం ఉండవు. టెక్నీషియన్ ఉన్నా అవసరమైన కెమికల్స్, కిట్స్ సరఫరా చేయక పోవడంతో మూడేళ్లుగా ల్యాబ్ మూత పడింది. 406 రకాల మందులు పంపిణీ చేయాల్సి ఉంటే కేవలం 50 రకాల మందులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. పోనీ వైద్యులు ఉన్నారా అంటే అదీ లేదు. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండాల్సుండగా ఇద్దరూ లేరు. మదనపల్లి నుంచి ఇక్కడికి ఒక వైద్యుడుని డిప్యూటేషన్‌పై నియమించారు. ఆయన వారంలో ఒక రోజు అలా వచ్చి ఇలా వెళ్లి పోతున్నారు. ఉన్న నర్సింగ్ సిబ్బంది వచ్చే రోగులను పరీక్షించి ఉన్న మందులను ఇస్తున్నారు. ఇక దీర్ఘ కాలిక రోగుల పరిస్థితి అయితే మరీ ఘోరంగా ఉంది.బిపి కోసం 8 రకాల మందులు రావాల్సి ఉంటే 2 రకాలు, షుగర్ కోసం 6 రకాల మాత్రలు రావాల్సి ఉంటే మూడు రకాలు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఇవి కూడా వైద్య సిబ్బంది ఒకటికి పది సార్లు ఇండెంట్ పెట్టి కార్మికులు తమపై తిరగబడుతున్నారని అధికారులకు విన్నవిస్తే ఈ మందులను పంపిణీ చేస్తున్నారు. ఒత్తిడి చేయక పోతే వచ్చే ఈ మందులు సైతం పంపిణీ చేసే స్థితి లేదు. దీంతో అవసరమైన మందులు అందక కార్మికులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. వ్యాధులు నయం చేసుకునేందుకు బయట మార్కెట్‌లో మందులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురంతో పాటు హిందూపురంలో రెండు, గుంతకల్లు, తాడిపత్రిలో ఒక్కో ఇఎస్ఐ ఆస్పత్రులు ఉన్నాయి. హిందూపురంలో రోజూ సుమారు 500లకు పైగా కార్మికులు వైద్య సేవల కోసం వస్తుంటారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురం ఈఎస్ఐ అసుపత్రిలో ఎక్కువ మంది వస్తుంటారు. హిందూపురం ప్రాంతంలో దాదాపు 20 వేల మందికి పైగా కార్మికులున్నారు. ఒక్కో కుటుంబంలో నలుగురు సభ్యులను కలుపుకుంటే మొత్తం సభ్యుల సంఖ్య సుమారు 80వేలకు చేరుకుంటుంది. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు ఆయా సంస్థలు తమ ఇఎస్ఐ వాటాను ప్రభుత్వానికి ప్రతి నెలా చెల్లిస్తున్నాయి. కార్మికుల కుటుంబ సభ్యులకు ఇఎస్ఐ డిస్పెన్సరీ, ప్యానెల్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తుంటారు. కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు, అనంతపురానికి ఇఎస్ఐ జాయింట్ ప్రాంతీయ కార్యాలయం కడపలో ఉంది. 28 డిస్పెన్సరీలు, ఆదోని, తిరుపతిలో ఆస్పత్రులు, నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. వైద్యుల లెక్క ప్రకారం ఆస్పత్రులు, డిస్పెన్సరీలకు ఒక్కో దానికి రోజుకు 100 నుంచి 150 మంది ఇఎస్ఐ కార్డు కలిగిన కార్మికులు చికిత్స కోసం వస్తుంటారు. డిస్పెన్సరీలకు అవసరమైన మందుల ఇండెంట్‌ను కడప జేడీ కార్యాలయం నుంచే విజయవాడ కార్యాలయానికి పంపిస్తుంటారు. ఏయే మందులు అవసరమో వాటిని అక్కడి నుంచి డిస్పెన్సరీలకు సరఫరా చేస్తారు. హిందూపురంలో పాటు అనంతపురం, కర్నూల్, కడప జిల్లాలకు ఆదోనిలో ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు సరఫరా అవుతాయి. అయితే గత మూడు సంవత్సరాలుగా పూర్తి స్థాయిలో మందులు సరఫరా కావడం లేదు.

ఇఎస్ఐ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు (ఫైల్‌ఫొటో)

మందుల కొరత

ప్రభుత్వం మందులు సరఫరా చేసే కంపెనీలకు బకాయిలు చెల్లించకపోవటంతో ఆ కంపెనీలు ఇఎస్ఐ ఆస్పత్రులకు అవసరమైన మందులను సరఫరా చేయడం లేదని తెలుస్తోంది. మూడు నెలలకు ఓ సారి ఆస్పత్రులకు అవసరమైన మందుల ఇండెంట్‌ను జేడీ ద్వారా విజయవాడలోని డైరెక్టర్‌కు పంపిస్తుంటారు. 406 రకాల మందులకు డాక్టర్లు ఇండెంట్ పెడుతుంటారు. దీర్ఘకాలిక వ్యాధుల మందులతో పాటు బీపీ, షుగర్, లివర్, కిడ్నీ, గుండె సంబంధిత తదితర వ్యాధులకు సంబంధించి మందులు తెప్పిస్తుంటారు. అయితే ప్రభుత్వం కంపెనీలకు పాత బకాయిలు ఇవ్వకపోవడంతో మందుల సరఫరా నిలిచిపోయినట్లు సమాచారం. 406 రకాల మందులకు గాను ఇప్పుడు కేవలం 50 రకాలు మాత్రమే వస్తున్నాయి. కార్మికులు నిత్యం వాడే బిపి, షుగర్, థైరాయిడ్ లాంటి రోగాలకు సైతం పూర్తి స్థాయిలో మందులు రావడం లేదు.

మూడేళ్లుగా మూత పడ్డ ల్యాబ్

హిందూపురం ఇఎస్ఐ అసుపత్రిలో ఉన్నా రక్త పరీక్షల విభాగంలో టెక్నీషియన్ ఉన్నారు. అయితే ల్యాబ్‌కు అవసరమైన కెమికల్స్, కిట్స్ సరఫరా చేయక పోవడంతో ల్యాబ్ మూడేళ్లుగా మూత పడింది. గతంలో అధునాతన యంత్రాలతో దాదాపు 20 రకాల రక్త పరీక్షలు నిర్వహించే వారు. అయితే ప్రస్తుతం హెచ్‌బి పరీక్ష మాత్రమే చేస్తున్నారు. రోగ నిర్ధారణ అయిన అనంతరమే వైద్యులు రోగులకు వైద్య సేవలను అందిస్తారు. అయితే రోగ నిర్ధారణ కోసం కార్మికులు వేలాది రూపాయలు చెల్లించి బయట ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకుని వచ్చినా వైద్యులు లేక పోవడంతో ఇక్కడ వైద్యం అందడం లేదు.

మందులే కాదు సిబ్బందీ లేరు...

హిందూపురం ఇఎస్ఐ అసుపత్రిలో ముందులే కొరతే కాదు సిబ్బంది కొరత సైతం వేధిస్తోంది. హిందూపురం, కొట్నూరు రెండు డిస్పెన్సరీలు ఒకే చోట నిర్వహిస్తున్నారు. కనీసం ఇద్దరు వైద్యులు ఉండాలి. ఇందులో ఒక్కరు కూడా లేరు. ఇక నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్, ఎంఎన్ఒతో పాటు క్లాస్-4కు సంబంధించిన అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాటు కార్యాలయంలో ఉండాల్సిన సీనియర్ అసిస్టెంట్‌లు సైతం లేరు. దీంతో రోగులతో పాటు వైద్యులు సైతం ఇబ్బంది పడుతున్నారు.

కార్మికులకు భారంగా వైద్యం...

చాలా మంది కార్మికులు అరకొర వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఏదైనా జబ్బుచేస్తే ఇఎస్ఐ కార్డుతో చికిత్స చేయించుకోవచ్చనే భరోసా కార్మిక కుటుంబాలకు ఉంటుంది. కార్మికులతో పాటు పిల్లలు, తల్లిదండ్రులకు ఉపయోగంగా ఉండేది. అయితే ఇఎస్ఐ డిస్పెన్సరీలో కూడా మందులు కొరత ఉండడం కార్మికులను కలవరపాటుకు గురిచేస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు సుమారు రూ.2 వేల నుంచి 3 వేల రూపాయల విలువ చేసే మందులను ఉపయోగిస్తుంటారు. వీరు క్రమం తప్పకుండా రోజూ మందులు వేసుకోవాల్సి ఉంది. అయితే ఇప్పుడు ఇఎస్ఐలో మందుల కొరత కారణంగా బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిరావడం కార్మికుల కుటుంబాలకు భారంగా మారుతోంది. ఇక్కడ సరైన వైద్యం అందక పోవడంతో ఇతర అసుపత్రుల్లో వైద్య సేవలు పొందితే దానికి సంబందించిన బిల్లులు ఆరు నెలలు గడిచిన మంజూరు కావడం లేదు. ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ అసుపత్రుల్లో ఇఎస్ఐ కార్డు ఉన్నా వారికి వైద్య సేవలు అందించమని తెగేసి చెబుతున్నట్లు కార్మికులు చెబుతున్నారు. దీనికి కారణం ఇఎస్ఐ వైద్య సేవలకు సంబందించి సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడమేనని తెలుస్తోంది. ప్రతి నెలా కార్మికులు ఇఎస్ఐ కోసం డబ్బులు చెల్లించినప్పటికి వైద్య సేవల కోసం అప్పులు చేసి, ఆ భారాన్ని మోయాల్సి వస్తోంది.

సౌకర్యాలు మెరుగు పర్చాలి

జిల్లాలో కార్మికుల కోసం ఉండే ఒకే ఒక అసుపత్రి ఇఎస్ఐ అసుపత్రి. ఈ అసుపత్రిలో మందులే కాదు వైద్యులు, సిబ్బంది సైతం లేకపోవటంతో కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదు. వెంటనే పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి అవసరమైన మందులను సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. రక్త పరీక్షల కోసం అవసరమైన కెమికల్స్, కిట్స్‌ను సరఫరా చేసి ల్యాబ్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. లేని పక్షంలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధమవుతాం.

ఇఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

పండగ పూటా పస్తులుండాల్సిందేనా..?

'శ్రీరామిరెడ్డి' కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు
డిసిఎల్ కు సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లా ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు అందరిని పరిస్థితి ఉందని దసరా పండగ పూట కూడా వారు పస్తులు ఉండాల్సిందేనా అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు అధికారులను ప్రశ్నించారు. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలన్న డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కార్మిక శాఖ ఉప కమిషనర్ కు సిఐటియు నాయకులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి వాటర్ సప్లై కార్మికులకు ఏడు నెలల బకాయి వేతనాలు, 12 నెలల పీఎఫ్ బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. వారి సమస్యలపై సెప్టెంబర్ ఐదు నుంచి 17 వరకు కార్మికుల సమ్మె చేశారని, 17వ తేదీ కలెక్టర్ జోక్యం చేసుకొని హామీ ఇవ్వడంతో సమ్మె వాయిదా వేశామని అన్నారు. అయితే 18 రోజులైనా వేతనాలు వేయకపోవడం సమస్య పరిష్కారం కాకపోవడంతో సెప్టెంబర్ 30 నుంచి తిరిగి కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. ఈ సమ్మెను పోలీసుల ద్వారా పరిష్కారం చేసుకోవాలని ప్రయత్నాలు చేయడం సరైంది కాదన్నారు. కార్మికులకు బకాయిలు ఇవ్వవలసిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పండుగ రోజులలో కూడా కార్మికులు పస్తులు ఉండాల్సి వస్తుందని .దీనికి కారణం ప్రభుత్వ నిర్వాకమేనని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వాటర్ సప్లై కార్మికులకు బకాయి వేతనాలు పిఎఫ్ చెల్లించి సమ్మె విరమింప జేయాలని దీనిపై లేబర్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎంపీ అంబికా

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. విజయవాడలోని బిఆర్‌టిఎస్ రోడ్ లోని సత్యనారాయణపురంలో ఉన్న ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ శుక్రవారం సౌత్ సెంట్రల్ రైల్వే ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ సభ్యుల సమావేశంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా గుంతకల్లు రైల్వే డివిజన్, అనంతపురం జిల్లాలోని రైల్వే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ఏ పనులు పూర్తిస్థాయిలో నిర్వహించలేదని చెప్పారు. నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రైల్వే పనులను, సమస్యలను పరిష్కరిస్తామని, ఎన్డీఏ ప్రభుత్వంలో అందరి భాగస్వామ్యంతో రైల్వే పనులను పూర్తి చేస్తామని తెలియజేశారు. విజయవాడ తర్వాత అనంతపురం జిల్లా గుంతకల్ డివిజన్ అభివృద్ధి అవుతోందని చెప్పారు. ప్రజల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ప్యాసింజర్ రైళ్లను నడపాలని, అలాగే ఉన్న ప్యాసింజర్ రైళ్లకు మూడు నాలుగు బోగీలను అనుసంధానం చేయాలని కోరారు. ప్రస్తుతం మచిలీపట్నం నుంచి అనంతపురం మీదుగా బెంగళూరుకు నడుస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ప్రతిరోజు నడపాలని కోరారు. బెంగళూరు నుంచి పుట్టపర్తి వరకు ఉన్న ప్యాసింజర్‌ను అనంతపురానికి నడపాలన్నారు. బెంగళూరు నుంచి ఢిల్లీకి నడుపుతున్న రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు అనంతపురంలో స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. బెంగళూరు నుంచి కాచిగూడకి నడుపుతున్న వందే భారత్‌ను హిందూపురంలో స్టాపింగ్ ఇవ్వాలన్నారు. గుంతకల్ డివిజన్‌లో అండర్ ప్రాసెస్ త్వరగా పూర్తి చేయాలని కోరారు. రైల్వే ప్రొటెక్షన్‌లో భాగంగా మహిళలు, ఇతర ప్యాసింజర్లు తమ గమ్యస్థానం చేరేవరకు రైల్వేలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. రైల్వేకి సంబంధించినటువంటి నిర్మాణాలు పూర్తి నిధులను ఇప్పించాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీలు సిఎం రమేష్ ఆధ్వర్యంలో కృషి చేయాలని విన్నవించారు. ఈ సమావేశంలో బెజవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లలోని ఎంపీలు, సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్, సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులు, డిజిఎంలు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఉచిత ఇసుక హామీని అమలు చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ఉచితంగా ఇసుకను అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి రాంభూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో మైనింగ్ ఆఫీస్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న రాంభూపాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరిగిపోవడంతో ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి ఏర్పడి ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడం జరిగినదన్నారు. ఎన్నికల ముందు ఈ సమస్యను రాజకీయ సమస్యగా కూటమి మార్చి అధికారంలోకి వచ్చిందన్నారు. ఉచితంగా ఇసుకను ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ వందరోజుల పాలనలో చూస్తే ఇసుక విషయంలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందని విమర్శించారు. జిల్లాలో అనేక ప్రాంతాలలో ఇసుక లభించడం లేదని, రవాణా చార్జీలు ,ఇతర పేర్లు చెప్పి ఇసుక రేట్లు గత ప్రభుత్వం మాదిరిగానే వసూలు చేస్తున్నారని, మరికొన్ని చోట్ల గత ప్రభుత్వం కంటే ఇసుక ధరలు పెరిగాయని విమర్శించారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నదని ,ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నేతలు పలుచోట్ల ఇసుకపై పెత్తనం చేస్తున్నారని అన్నారు. ఈ విషయం పట్ల ముఖ్యమంత్రి ఎన్ని మార్లు బహిరంగంగా హెచ్చరించిన పరిస్థితుల్లో మార్పు కనబడలేదని అన్నారు. ఇసుక కొరత, అధిక రేట్ల వల్ల భవన నిర్మాణ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కొరవడిందని ఇళ్ల నిర్మాణాలు చేసుకునే చిన్న, మధ్యతరగతి వర్గాలపై భారాలు పడుతున్నాయని అన్నారు. ఇసుక ఆన్లైన్ విధానం ప్రవేశపెడుతున్నామని ప్రభుత్వం చేసిన ప్రకటనలు హామీలకు, ఆచరణకు పొంతన లేకుండా ఉందని విమర్శించారు. ధరల్లో తీవ్రమైన వ్యత్యాసం ఉందని రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఇసుక లభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇసుకలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి నగర కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూదు, వలీ, రాజు, గపూరు ,శీన ,జీవ ,వెంకటేశు, నూరుల్లా, గ్రానైట్ అండ్ టైల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి రెడ్డి, మహదేవ్ నగర్ శ్రీనివాసులు, ధన, ప్రసాదు రాక్ బ్రైండర్స్ నాయకులు సూర్యనారాయణ, అబ్దుల్లా, రామ్మోహన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జిలాన్ , భాష, శ్రీనివాసులు కార్పెంటర్ యూనియన్ నాయకులు భాస్కర్, వన్నూరు, వలి శర్మాష్ ,హాజీవలి, శంషాద్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో దార్శనిక ప్రణాళిక

కలెక్టర్ వినోద్ కుమార్

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జెడ్పీ ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో వివిధ రంగాలకు చెందిన నిపుణులు, మేధావుల సూచనలు, సలహాలతో జిల్లా దార్శనిక పత్ర ప్రణాళిక రూపకల్పన చేపడతామని జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో శుక్రవారం జిల్లా విజన్ ప్లాన్ ప్రణాళిక రూపకల్పనపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, ఎన్జీవోలు, రైతు సంఘ నాయకులు, రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ ఆంధ్ర - 2047 తీసుకువచ్చారన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు, మేధావుల భాగస్వామ్యం ఉండాలన్నారు. జిల్లాలోని కీలక రంగాలపైన దృష్టి సారించి జిల్లా అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పన చేసుకుని రానున్న ఐదు సంవత్సరాల్లో జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు గ్రామ, మండల స్థాయిలో ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. జిల్లా అభివృద్ధికి రూపొందించాల్సిన ప్రణాళికపై స్మార్ట్ ఫోన్ ఉన్న వారు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకుని లిఖితపూర్వకంగా రెండు రోజుల పాటు సలహాలు, సూచనలు తెలపవచ్చునన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలను రైతులకు అనుసంధానం చేయాలన్నారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, తదితర రంగాలపై మరింత ఎక్కువగా దృష్టి పెట్టి చర్యలు చేపట్టాలన్నారు. గతంలో ప్రభుత్వ స్థలాల్లో చింత చెట్లు పెంచే వారని, ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలలో చింత, వేప చెట్లు పెంచాలని సూచించారు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలు పెరిగేలా కృషి చేయాలన్నారు. రాయదుర్గంలో కరోనా సమయంలో మూతపడ్డ పరిశ్రమలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం మాట్లాడుతూ యునాని ఆయుర్వేద, సిద్ధ, హోమియో, మెడిసిన్ లను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నాణ్యమైన విద్యను గతంలో అందించామని, వాటిని మరింత నాణ్యతతో అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. జిల్లాలో చారిత్రాత్మక ప్రదేశాలు అభివద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, సిపిఒ అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, ఎల్‌డిఎం నర్సింగరావు, డిఎంహెచ్‌ఒ డాక్టర్.ఈబి.దేవి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ విజయలక్ష్మి, హార్టికల్చర్ డిడి నరసింహారావు, ఏపీఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ డిడి ఖుష్‌బీ కొఠారి, చేనేత జౌళి శాఖ ఏడీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, డిటిసి వీర్రాజు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్. కిరణ్ కుమార్ రెడ్డి, సర్వే ఏడీ రూప్లానాయక్, ప్రజాప్రతినిధులు, మేధావులు, ఎన్జీవోలు, రైతులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బండి కింద పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - కణేకల్

మండలకేంద్రానికి చెందిన ఆరేళ్ల బాలుడు ఎద్దులబండి కింద పడి మృతిచెందాడు. శుక్రవారం ఉదయం జరిగిన ఈఘటనకు సంబందించిన వివరాలు... మండలకేంద్రానికి చెందిన ఎరిస్వామి ఎద్దుల బండితో ఇసుక రవాణా చేస్తూ జీవనం చేస్తున్నాడు. ఆయన కుమారుడు జస్వంత్ (6) స్థానిక నేషనల్ స్కూల్‌లో యుకెజి చదువుతున్నాడు. దసరా సెలవులు కావటంతో ఇంటివద్దనే ఉన్న జస్వంత్ తన తండ్రి వెంట ఇసుక తీసుకురావటానికి వెళ్లే ఎద్దుల బండిలో వెళ్లాడు. ఇసుక తీసుకుని వచ్చే సమయంలో ఎద్దుల బండిమీద కూర్చొని ఉన్న జస్వంత్ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఆ సమయంలో ఎద్దులబండి టైరు జస్వంత్ మీద వెళ్లడంతో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మృతిచెందిన జస్వంత్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కార్మిక, ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం. నాగరాజు అధ్యక్షతన మున్సిపల్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు 12వ పిఆర్‌సిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈనెల 14వ తేదీ నుంచి జనరల్ బాడీ సమావేశాలు నిర్ణయించి సంతకాల సేకరణ, మేయర్, ఛైర్మన్లకు వినతిపత్రాలు అందజేయడం, 28వ తేదీ నుంచి ధర్నాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ సమావేశంలో మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగభూషణం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, అనంతపురం మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ, కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి, సాకే.తిరుమలేష్, కోశాధికారి ఎం.లక్ష్మీనరసమ్మ, రామాంజినేయులు, జగదీష్, రాము, సూర్యనారాయణ, ధనలక్ష్మి, జుబెర్, వన్నూరుస్వామి, ముత్తురాజు, తిప్పేరుద్ర, ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులు, కోవిడ్, మలేరియా, గార్బేజ్ కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులను అరికడదాం

ఉరవకొండ : వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించి సీజనల్ వ్యాధులను అరికడదామని ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి భత్తుల కోదండరామిరెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం విడపనకల్ మండల కేంద్రంలో గ్రామ కార్యదర్శి మహబూబ్‌బాషా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ కంబయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్రామమంతా తిరిగి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ఆవశ్యకత వివరించారు. అనంతరం కోదండరామిరెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఎంతమంది రోగులు చికిత్స కోసం వస్తున్నారు.. జ్వరపీడితులు ఎంతమంది ఉన్నారు.. ఎంతమందికి రక్త నమూనాలు సేకరిస్తున్నారన్న విషయాలను ల్యాబ్ టెక్నీషియన్ నూర్‌బాషాను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నూర్‌మహమ్మద్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి తొట్టెను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం రూరల్ తహశీల్దార్ కార్యాలయం ముందు నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు

ఉచిత ఇసుక పూర్తిస్థాయిలో అమలు చేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ధర్నాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సిపిఎం న్యూటౌన్ కమిటీ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, రూరల్ మండల కార్యదర్శి టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం న్యూటౌన్, రూరల్, మండల కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రూరల్ తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరిగిపోవడం, విచ్చలవిడి అవినీతితో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందన్నారు. ఈ సమస్య ఏకంగా రాజకీయ సమస్యగా మారి అధికార మార్పిడిలో కీలకమైందని గుర్తు చేశారు. ఈనేపథ్యంలో ఎన్నికల ముందు టిడిపి నాయకులు తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తవుతున్నా ఇసుక విధానంపై స్పష్టత ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. అంతేగాకుండా ఇసుక పాలసీ విధానం తెలికపోవడంతో అనేకచోట్ల ఇసుక లభించడం లేదన్నారు. రవాణా ఛార్జీలు, ఇతర పేర్లు చెప్పి ఇసుక రేట్లు తగ్గించలేదన్నారు. దీనికితోడు ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోందన్నారు. అధికార పార్టీ నాయకులు బహిరంగంగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తద్వారా ఇళ్ల నిర్మాణాలు చేసుకునే చిన్న, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఉచిత ఇసుక పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముత్తుజ, అల్తాఫ్, ఆజాం, బైపురెడ్డి, గౌస్, రంగా, ప్రసాద్, అక్బర్, బాబు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు వి.నిర్మల, సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్.రేణుక, యు.మల్లికార్జున మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఇసుక లభించక విపరీతంగా ధరలు పెరిగిపోయాయన్నారు. ఉచితంగా ఇసుకను సరఫరా చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజులు గడిచిన విధానం అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. ఉచితంగా ఇసుకను సరఫరా చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రేవతి, శ్యామల, కవిత, మారి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఇసుక లేకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాబట్టి ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి, నాగరాజు, చంటి, రామ్మోహన్, శ్రీరాములు, శివ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పథకాన్ని తీసుకురావాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇసుక విధానాన్ని నిర్వీర్యం చేసినట్లుగానే ప్రభుత్వం కూడా అలాగే చేస్తోందన్నారు. తద్వారా భవన నిర్మాణ కార్మికులు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే ఇసుక దక్కుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఆత్మకూరు : కూటమి ప్రభుత్వం వెంటనే ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడంతో విచ్చలవిడిగా ధరలు పెంచారన్నారు. దీనితోడు అవినీతి ఎక్కువ కావడంతో ప్రజలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. దీనికితోడు చాలాచోట్ల అధికార పార్టీ నాయకులు ఇసుకను అక్రమంగా తరలిస్తూ అధిక ధరలకు విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి జిల్లా కార్యదర్శి రామయ్య, రైతుసంఘం మండల కార్యదర్శి రాము, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి జయమ్మ, ఐద్వా మండల కార్యదర్శి వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, నాయకులు వెంకటచౌదరి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడంతో రేట్లు పెరిగిపోవడం, విచ్చలవిడి అవినీతి వల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడి కూటమిని గెలిపించారన్నారు. వీరి కూడా వారి బాటలోనే నడుస్తూ ఇసుకలో దోచుకుంటుండటం బాధాకమరన్నారు. ఎన్నికల ముందు వందరోజుల్లో ఉచిత ఇసుక ఇస్తావని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరిండం బాధాకమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుకను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, జె.పెద్దయ్య, బి.కుళ్లాయప్ప, గురుస్వామి, మారుతి, నాగప్ప, జయరాజు, భవన నిర్మాణ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

రాయదుర్గం : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఉచిత ఇసుక హామీ అమలు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో అధికార మార్పిడిలో ఉచిత ఇసుక విధానం హామీ కీలకంగా మారిందన్నారు. అయితే కూటమి నాయకులు అధికారంలోకి వచ్చినా ఉచిత ఇసుక పథకం అమలు కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, పట్టణ నాయకులు తిమ్మరాజు, మధు, ఉమేష్, హనుమంతు, నాగేంద్రనాయక్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ఉరవకొండ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరిగిపోవడం, విచ్చలవిడి అవినీతి కారణంగా ప్రజలు అధికార మార్పిడికి కోరుకుని కూటమికి అవకాశం ఇచ్చారన్నారు. అధికార మార్పిడిలో ఉచిత ఇసుక విధానం కీలకంగా మారిందన్నారు. అయితే కూటమి నాయకులు అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఉచిత ఇసుకను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రైతుసంఘం నాయకులు సీనప్ప, మురళి, భవన నిర్మాణ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ (రీసర్వే) కుళ్లాయప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందన్నారు. ఈ సమస్య రాజకీయ సమస్యగా మారి అధికారి మార్పిడికి కూడా కారణమైందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం కూడా అదే తరహాన్నే అవలంభించడం బాధాకరమన్నారు. తక్షణమై ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రంగనాథ్, రఘు, నరేష్, హనుమంతు, రామచంద్ర, నాగరాజు, తిమ్మప్ప, ఈశ్వర్, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు : ఉచిత ఇసుక విధానాన్ని తక్షణం అమలు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఉచిత ఇసుక విధానంపై విధి, విధానాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల అధ్యక్షులు ఎం.పోతులయ్య, నాయకులు పిసుబ్బిరెడ్డి, కె.లక్ష్మీనారాయణ, కె.ఆనంద్‌బాబు, సి.వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

గుత్తి ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్

గుత్తి : మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా ప్రభాకర్‌నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీపై వెళ్లగా పామిడిలో విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌నాయక్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామపంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఎంపిడిఒను ఇఒఆర్‌డి శివాజీరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు.

పెద్దపప్పూరు ఎంపిడిఒ బి.శకుంతల

పెద్దపప్పూరు : మండల ఎంపిడిఒగా బి.శకుంతల శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపిడిఒగా పని చేస్తున్న రామకృష్ణ గుమ్మఘట్టకు బదిలీపై వెళ్లారు. దీంతో సత్యసాయి జిల్లా నల్లచెరువులో పని చేస్తున్న శకుంతల సాధారణ బదిలీల్లో భాగంగా పెద్దపప్పూరుకు వచ్చి బాధ్యతలు చేపట్టారు. అలాగే తాడిమర్రి నుంచి ఎఒగా రమాదేవి బాధ్యతలు చేపట్టారు. వీరిద్దరికి పంచాయతీ సెక్రటరీ, జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పామిడి : పామిడి ఎంపిడిఒగా కె.తేజస్విని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు ఎంపిడిఒకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇకపోతే ఇఒఆర్‌డిగా డి.రాజేంద్ర కృష్ణకుమార్, పామిడి గ్రామపంచాయతీ కార్యదర్శిగా గోపాల్, తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రెడ్డి, ఎంపిడిఒ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎం.భరత్‌కుమార్, టైపిస్ట్‌గా కృష్ణతేజ విధుల్లో చేరారు.

పుట్లూరు ఎంపిడిఒ అలివేలమ్మ

పుట్లూరు : మండల ఎంపిడిఒగా అలివేలమ్మ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపిడిఒ యోగానందరెడ్డి గార్లదిన్నెకు బదిలీ కాగా కనగానపల్లిలో విధులు నిర్వహిస్తున్న అలివేలమ్మ ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పెద్దవడుగూరు ఎంపిడిఒ బారాన్‌సాహెబ్

పెద్దవడుగూరు : మండల ఎంపిడిఒగా బారెనాసాహెబ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న కుళ్లాయిస్వామిని కూడేరుకు బదిలీ చేయగా పుట్టపర్తి జిల్లా కొత్తచెరువులో విధులు నిర్వహిస్తున్న బారాన్‌సాహెబ్‌ను ఇక్కడికి నియమించారు. కాగా ఎంపిడిఒను సర్పంచి వరలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తాడిపత్రి రూరల్ ఎస్ఐగా ధరణిబాబు

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి రూరల్ ఎస్ఐగా ధరణిబాబు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నుంచి తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. గతంలో తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ధరణిబాబు ఎస్ఐగా పని చేసిన అనుభవం ఉంది.

జిల్లాకు 1,541మెట్రిక్ టన్నుల ఎరువులు రాక

అనంతపురం : 1541 మెట్రిక్ టన్నుల స్పిక్ కంపెనీ ఎరువులు జిల్లాలోని ప్రసన్నాయపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు వచ్చినట్లు అనంతపురం వ్యవసాయ డివిజన్ ఎడిఎ ఎం.రవి తెలిపారు. యూరియా 396 మెట్రిక్ టన్నులు, డిఎపి 575 మెట్రిక్ టన్నులు, 20:20:0:13. 570 మెట్రిక్ టన్నులు వచ్చాయని తెలిపారు. వీటిని శుక్రవారం పరిశీలించి కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

జెఎన్‌టియు ఎంబిఎ, ఎంసిఎ ప్రవేశాలకు అడ్మిషన్లు

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ఎంసిఎ కోర్సుకు, మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఎంబిఎ కోర్సులకు శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించినట్లు డైరెక్టర్ అడ్మిషన్ ఆర్.కిరణ్మయి తెలిపారు. మిగిలిన కన్వీనర్ సీట్లలో ఎంబిఎ, ఎంసిఎ కోర్సులకు ఈనెల 7న స్పాట్ అడ్మిషన్లు ఉంటాయన్నారు. ఇంతవరకు ఎక్కడా అడ్మిషన్ తీసుకోకుండా ఉండే విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులన్నారు. అంతేగాకుండా స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఫీజురీయింబర్స్‌మెంట్‌కు అర్హులు అన్నారు. అర్హత, ఆసక్తి విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు, జిరాక్స్ కాపీలను తీసుకుని హాజరుకావాలని కోరారు.

డ్రైయినేజీలు ఏర్పాటు చేస్తాం

ఉరవకొండ : పట్టణంలో శాశ్వత డ్రైయినేజీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పాత బస్టాండ్ గుంతకల్లు రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు ఇబ్బందిగా ఉన్నదన్న విషయాన్ని స్థానికులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా భవన నిర్మాణాల వేస్ట్‌తో పాటు గరుసు వేసి నీరు వెళ్లేలా చేశారు.

నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే 'గుమ్మనూరు'

పామిడి : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌తోపాటు ఆయన కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్ శుక్రవారం విజయవాడలోని నివాసం వద్ద మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయవాడ వరద బాధితుల కోసం తాను ప్రకటించిన రూ.5 లక్షలు, నియోజకవర్గం తరపున రూ.3లక్షల చెక్కును లోకేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుంతకల్లు పట్టణంలో ఉర్దూ మైనారిటీ జూనియర్ కాలేజీ మంజూరు చేయాలని, పామిడిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరగా స్పందించిన నారా లోకేష్ ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్‌ఆర్.రమేష్, హరీష్ పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే గుమ్మనూరు, నాయకులు

లోకేష్‌ను కలిసిన గుత్తి నాయకులు

గుత్తి : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను టిడిపి గుత్తి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి, నాయకుడు చెరుకూరి లక్ష్మణ్‌చౌదరి శుక్రవారం ఉండవల్లి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా గుత్తి మున్సిపాలిటీ గురించి వివరించారు. వంద రోజుల్లోనే మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో పలు అభివృద్ధి పనులు జరిగాయని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన గుత్తి నాయకులు

నార్పల వైద్యశాల తనిఖీ

నార్పల : మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలను జిల్లా వైద్యాధికారిణి ఇబి.దేవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం వైద్యశాలలో ఇంజక్షన్ వేయించుకున్న కుళ్లాయప్ప ఇంజక్షన్ వికటించడంతో మృతిచెందడంతో బంధువులు, ప్రజాసంఘాలు ఆసుపత్రి ఎదుట ధర్నాకు దిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసేందుకు జిల్లా వైద్యాధికారిణి తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ప్రాథమిక వైద్యశాల వైద్యుడు ప్రవీణ్‌కుమార్, వైద్య సిబ్బంది విచారించారు. పూర్తిస్థాయిలో విచారణ తర్వాత వైద్యశాలలోనే తప్పు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్ఒ తెలిపారు.

పప్పుశనగ కోసం 573 మంది రిజిస్ట్రేషన్

పుట్లూరు : మండలంలో మొదటిరోజు శుక్రవారం పప్పుశనగ విత్తనాల కోసం 573 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఎఒ కాత్యాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 822 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయన్నారు. ఇంకా కావాల్సిన రైతులు తప్పనిసరిగా పప్పుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

పంటకోత ప్రయోగం

బుక్కరాయసముద్రం : మండలంలోని జంతలూరు, గోవిందంపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రవి పర్యవేక్షణలో వేరుశనగ పంటలో శుక్రవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాల ద్వారా ఏ రైతుకూ నష్టం జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఇకెవైసి చేయించుకునేందుకు రెండు రోజులు మాత్రమే గడువు ఉందని, ఇప్పటి వరకూ ఇకెవైసి చేయించుకోని రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్యాంసుందర్, ఎఎస్ఒ పోలిరెడ్డి, ఎఇఒ జ్ఞానజ్యోతి, పట్టు పరిశ్రమ సహాయకుడు రమాకాంత్, రైతులు పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో న్యాయవాది మృతి

రామ్మూర్తి (పాతచిత్రం)

కళ్యాణదుర్గం : పట్టణానికి చెందిన న్యాయవాది రామ్మూర్తి బ్రెయిన్ స్ట్రోక్‌తో శుక్రవారం మృతిచెందాడు. రామ్మూర్తికి వారంరోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు బెంగళూరు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు.

మృతురాలి కుటుంబానికి 'కాపు' పరామర్శ

కణేకల్ : మండలకేంద్రంలోని ఆదర్శభారతి రైతుసేవా సంఘం మాజీ అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి తల్లి కామాక్షమ్మ మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాపురామచంద్రారెడ్డి మృతురాలి కుమారుడు ప్రకాష్‌రెడ్డిని, కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రకాష్‌రెడ్డి కుటుంబంతో తనకు ఉన్న అనుబంధాన్ని ఈసందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు.

తిరుపతి లడ్డూ వివాదంపై నిజానిజాలు నిగ్గుతేల్చాలి

ప్రజాశక్తి-అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

తిరుపతి లడ్డు వివాదంపై స్వతంత్ర సంస్థకు విచారణ అప్పగించడాన్ని స్వాగతిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం అనంతపురంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వెంకటేశ్వర స్వామికి కోట్ల మంది భక్తులు ఉన్నారన్నారు. అలాంటి స్వామి ప్రసాదం లడ్డులో కల్తీ నెయ్యి, పశువుల కొవ్వు వాడుతున్నారని సిఎం చంద్రబాబు ఆరోపించడం బాధాకరమన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మాట్లాడిన సిఎంతోపాటు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు సుప్రీంకోర్టు నిర్ణయం చెంపపెట్టు అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కూడా రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారు మాట్లాడిన తీరుని తప్పుపట్టడం సంతోషకరమన్నారు. లడ్డు వివాదంపై మాజీ సిఎం జగన్ సుప్రీంకోర్టుతోపాటు ప్రధానమంత్రి కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేపట్టాలని లేఖలు రాశారన్నారు. ఎట్టకేలకూ సుప్రీంకోర్టు సిబిఐ డైరెక్టర్‌తోపాటు ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సంస్థ విచారణకు ఆదేశాలు ఇవ్వడం శుభ పరిణామం అన్నారు. స్వతంత్ర సంస్థ నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి నిజానిజాలు నిగ్గ తేల్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసిపి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కెవి.రమణ పాల్గొన్నారు.

గూళపాళ్యం హంపన్నకు నివాళి

ప్రజాశక్తి-గుత్తి

మహిళల మానప్రాణాలను కాపాడి సిపాయిల తూటాలకు ప్రాణాలు అర్పించిన గూళపాళ్యం హంపన్నకు వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని ఆయన స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, గుత్తి కోట పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ఇస్మాయిల్ మాట్లాడుతూ హంపన్న రైల్వే గేట్ కీపర్‌గా విధులు నిర్వహిస్తూ బ్రిటీష్ సిపాయిల భారి నుంచి రక్షించడానికి చేసిన పోరాటాన్ని గుర్తు చేశారు. యువకులు హంపన్నను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి కోట పరిరక్షణ కమిటీ నాయకులు కె.నాగేంద్రప్రసాద్, నిజాముద్దీన్, వైసీపీ నాయకులు డి.షఫీ, వరిగడ్డి షేక్ష, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు అంజనప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, పెన్షనర్ల సంఘం నాయకులు వెంకటేష్, నారాయణరెడ్డి, షేక్షావలి, గోవిందప్ప, చెన్నారెడ్డి, గోవిందు, నారాయణశెట్టి, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

హంపన్నకు నివాళులర్పిస్తున్న నాయకులు

గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి : ఎంపిపి

బుక్కరాయసముద్రం : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. శుక్రవారం మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కువగా తాగునీటి సమస్యలు వస్తున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా వైద్యం, ఆరోగ్యం, స్త్రీశిశు సంక్షేమం, విద్యుత్, విద్య, వ్యవసాయం, గృహ నిర్మాణం, పశుపోషణ, ఉపాధి పథకాలపై సమీక్ష నిర్వమించారు. ఈ సమావేశంలో జడ్పిటిసి నీలం భాస్కర్, తహశీల్దార్ పుణ్యవతి, మండల విద్యాధికారి నవీన, పరిపాలనాధికారి, ఎంపిటిసి, సర్పంచులు పాల్గొన్నారు.

అధిక వడ్డీ వ్యాపారులపై చర్యలకు వినతి

బుక్కరాయసముద్రం : పేద, బడుగు, బలహీన వర్గాలను పట్టిపీడిస్తున్న అధిక వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ కరుణాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిడి తట్టుకోలేక రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దళిత రాముడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గతంలో పసులూరు గ్రామంలో కూడా ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాణాలు బలికాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూసల సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు, ఎంఆర్‌పిఎస్ నాయకులు రెడ్డిపల్లి నాగరాజు, మారుతి, రామాంజనేయులు, నరేష్, రామకృష్ణ, రమేష్, బాధితులు నాగమ్మ, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ, కుష్టువ్యాధి గుర్తింపుపై శిక్షణ

బ్రహ్మసముద్రం : క్షయ, కుష్టు వ్యాధుల గుర్తింపుపై శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పి హెల్త్ అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ క్షయ, కుష్టువ్యాధులు ఎలా వ్యాపిస్తాయి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్ధారించే పద్ధతులు, క్షయ అంటే ఏమి, వ్యాధి సోకితే రోగి ఎలా ఉంటాడనే విషయాలను వివరించారు. రెండు వారాల నుంచి సాయంత్రం జ్వరం, నోటి గళ్లలో రక్తం పడటం, ఉన్నట్టుంది బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఒకవేళ క్షయవ్యాధిగా నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

మామిడి పంటను పరిశీలిస్తున్న అధికారులు

శింగనమల : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ సూచించారు. శుక్రవారం మండలంలోని కల్లుమడి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరుకావాలన్నారు. అంతేగాకుండా సచివాలయంతోపాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలాగే సచివాలయంలో సమర్పించే వినతులకు సత్వర పరిష్కారం చూపాలన్నారు.

ఈ-పంట నమోదు పరిశీన

మండల పరిధిలోనే సోదనపల్లి, కల్లుమడి గ్రామాల్లో చేపట్టిన ఈ-పంట నమోదును జెసి సూపర్ చెక్ చేశారు. ఇందులో భాగంగా వరి పైరు, మామిడి తోటలను పరిశీలించారు. శింగనమల రెవెన్యూ గ్రామంలోని 425/9 సర్వే నెంబర్‌లో మామిడి, సోదనపల్లి రెవెన్యూ గ్రామంలోని 268/2, 289-2 వరిపంట, కల్లుమడి గ్రామంలో వరి పొలాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాముడు, తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, హార్టికల్చర్ అధికారిణి శైలజ, విఆర్‌ఒలు శ్రీనివాసరావు, తాతయ్య, ఎపిఇఒలు రాజారెడ్డి, ఉమాదేవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి - అనంతపురం

అన్నదానం చేస్తున్న సాకేజయప్ప అభిమానులు

నగర సీనియర్ యూత్ టిడిపి నాయకుడు సాకే జయప్ప పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, హన్ను, సాయి, రవి, జన, సాకే బ్రదర్స్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

62.7 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాప్తాడు : అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసి 61.7 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం నగిరిగిరికి చెందిన గంగన్న శివరాజు వృత్తిరీత్యా నూనెల వ్యాపారం చేసేవాడు. ఇందులో భాగంగా మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంలో గ్రామాలకు వెళ్తూ వివిధ అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి ఉచితంగా కేరళ తరహా వైద్యం చేస్తామని నమ్మబలికేవారు. అంతేగాకుండా వివిధ ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలతో కలిసి పని చేస్తున్నట్లు చెప్పేవారు. ఈనేపథ్యంలో ఈనెల 30న ఉదయం అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శివరామనాయుడు, భార్య రామలక్ష్మికి మాయమాటలు చెప్పి ఆమె మెడలోని రెండు పొరలు కలిగిన బంగారం మాంగల్యం చైన్, చెవి కమ్మలు (57.7 గ్రాముల) బంగారాన్ని దొంగలించారు. కేసు నమోదు చేసుకున్న ఇటుకులపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి విచారింగా చోరీ ఒప్పుకున్నట్లు తెలిపారు. అనంతరం నిందితుడి నుంచి సుమారు రూ.3.2లక్షల విలువైన 62.7 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ శివారులో శుక్రవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిద్దె తండా గ్రామానికి చెందిన దివాకర్ నాయక్ పని నిమిత్తం ద్విచక్రవాహనంలో గుత్తికి బయలుదేరాడు. అయితే బసినేపల్లి వద్దకు రాగానే అతడి ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనమేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.